# పేరు మీరే పెట్టండి.

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

విరివిగా దానాలుచేస్తూ 'దానకర్ణుడు' అని కర్ణుడు పేరు తెచ్చుకుంటున్న కాలం అది...

ఏది అడిగినా లేదనకుండా వెంటనే యిచ్చేస్తూ ప్రజల్లో గుడ్ యింప్రెషన్ గెయిన్ చేస్తున్న సమయం అది...

ప్రజలు ఆనందంతో కర్ణుడికి డి.వి.యస్. కర్ణ (దాన వీర శూర కర్ణ) అనే బిరుదు ఇవ్వబోతున్న తరుణం అది...!

ఓ గంట కట్టించి దానికి జస్టిస్ బెల్ (ధర్మగంట) అని పేరుపెట్టి అది మ్రోగించిన మరుక్షణంవచ్చి ఆ గంట కొట్టినవ్యక్తి కోరిక తీరుస్తున్నాడు కర్ణుడు.

కర్ణుడి ఇంటికి జనం కావలసినన్ని కోరికల్తో వస్తున్నారు. కోరికల్ని తీర్చుకుంటున్నారు. ఏ లోటూ లేకుండా ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారు. వాళ్ళ జీవన విధానం ముప్పైపువ్వులు అరవైకాయలుగా ఉంది.

తను చేస్తున్న దానాలగురించి, ప్రజలు తనపై కురిపిస్తున్న పొగడ్తల గురించి ఆలోచిస్తూ...ఏవేవో హెల్యూసినేషన్స్‌లో తేలిపోతున్నాడు.

ఇంతలో ఓ రోజు...

ఎ.సి. ఆన్‌చేసి రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చుని ఏదో ఆలోచిస్తున్న కర్ణుడికి గంట వినిపించింది. కోరికలుతీర్చడమే ధ్యేయంగా పెట్టుకున్న కర్ణుడు బైటికివెళ్ళేడు. ఓ వందమంది దాకా ఉన్నారు. వాళ్ళచేతుల్లో ఏవేవో పాత్రలున్నాయి.

"మీ కోరికలు వివరించెదరా... యథాశక్తి మిమ్ములను శాటిస్‌ఫై చేయుటకు ట్రై చేయుదును..." వినమ్రతతో అన్నాడు కర్ణుడు. దానికి సమాధానంగా వాళ్ళందరూ వాళ్ళవాళ్ళ చేతుల్లోని పాత్రలు పైకెత్తి "దాహం... దాహం... నీళ్ళు... నీళ్ళు... తాగడానికి నీళ్ళు కావాలి. వుయ్ వాంట్ వాటర్.." అని ముక్త కంఠంతో అన్నారు.

లిప్తపాటు కాలంలో అతని ముఖంమీద భయం నర్తించింది. రెప్పపాటు కాలంలో అతని ముఖం చెమటతో నిండిపోయింది.

"మేం భాగ్యనగరం నుంచి వచ్చేము. కర్ణా!... మా కోర్కె తీర్చుము... ఇఫ్ నాట్- మేం దాహంతో చచ్చుట ఖాయం..." వందమందిలో ఒకతను అన్నాడు.

కర్ణుడు నిలబడిపోయాడు స్థబ్దంగా... స్థాణువులా... తన కాలికింద భూమి తిరిగిపోతున్నట్టు . భూమి రెండుగా చీలుతున్నట్టు అనిపించింది కర్ణుడికి.

నన్ను ఫూల్ చెయ్యడానికి ప్రయత్నమా? కర్ణుడి స్వగతం.

అమృతాంజనం ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లో మొదటి ఫోటోలా పెట్టేడు కర్ణుడుమొహం. ఉడుకుమోత్తనంతో "ఇంపాసిబుల్!" గట్టిగా అరిచాడు.

"...కవచకుండలాలు ఇమ్మంటే నిస్సంకోచంగా తీసిచ్చాను. కుంభపోత వర్షంలో నిర్మొహమాటంగా బిల్డింగ్‌లు బద్దలుకొట్టించి ఇచ్చాను... ఈ నీళ్ళ విషయంలో మాత్రం నన్ను వదిలెయ్యండి... ప్లీజ్... ఐ కాంట్ హెల్ప్ యు. అయాం వెరివెరీ సారీ..." అనేసి నిరాశగా వెనుదిరిగేడు కర్ణుడు.

(కేవలం హాస్యం కోసం రాసిందికాని ఇది ఎవరినీ కించపరచడానికి కాదని మనవి నీళ్ళ సమస్యని అనుభవించిన ప్రతి ఒక్కరికీ ఈ కథ అంకితం.)

—గోపరాజు రాధాకృష్ణ

(మోరి)

ఎన్నికైన గెస్ట్ ఎడిటర్ :

శ్రీ గాంధీ



**వేలాది కథల్ని పరిశీలించి పదుల్ని ఎంపిక చేయటం 'జ్యోతి' మాస పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ గాంధీగారికి వెన్నతో పెట్టిన విద్య అనే చెప్పాలి. పత్రికారంగంలో ఓ మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకున్న శ్రీగాంధీ, కార్యదక్షుడే కాక, పిన్నవయసులోనే ఓ విశిష్టమైన స్థానాన్ని అధిష్ఠించటం ప్రశంసనీయం!**

**"ఇంటింటికో రచయిత తయారవుతున్న ఈరోజుల్లో ఉత్తమ కథల్ని ఎంపికచేయటం కష్టమే అయినా- అసాధ్యమైంది కాదు" నవ్వుతూ తన అభిప్రాయం వెలిబుచ్చిన గాంధీ మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నారు. ఇక చదవండి.**

## సన్మానం

చేతిలోని అద్దంముక్కలో తన రూపాన్ని సరిచూసుకుని... చుట్టూ చూశాడు ఆనందరావు-

ఆ ఇరుకు గదిలోనే చెరో మూలకూర్చుని ముఖానికి రంగు పులుముకోవడంలో నిమగ్నమై ఉన్నారు మరి కొందరు-

బయట ఓపిక నశిస్తున్న ప్రేక్షకుల ఈలలు, కేకలు కలగాపులగంగా చెవిన పడుతూ ఉంది... ఇంతలో భార్య సత్యవతి ప్రత్యక్షం కావడంతో దారి చేసుకు ఆమెవైపు నడిచాడు ఆనందరావు- ఆడవేషంలోవున్న భర్తవైపు చిలిపిగా చూస్తూ "ఈ నా చీరలో మీరు చాలా బావున్నారండి ?" అంది నవ్వుతూ-

అందులో వ్యంగ్యముందో.... విసురుందో గాని భుజాలు తడుముకున్నాడు ఆనందరావు- ఎందుకంటే సత్యవతి నెల రోజులనుండీ పోరుతోంది... వున్న రెండు చీరల్లో ఒకటి మరీ పాతదై చిరుగులు పట్టిందని... వేరొకటి కొనిపెట్టమని...